నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 24 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI

ప్రజాభిప్రాయ సేకరణలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న మహిళలు

'భారీ పోలీస్ బందోబస్తు.. నిరసనలు.. గో బ్యాక్ అంబుజా.. గో బ్యాక్ అంటూ నినాదాలు.. అడ్డగింతలు.. ఆందోళనలు.. ఉద్రిక్త పరిస్థితులు' ఇవీ రామన్నపేట అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణలో చోటుచేసుకున్న ఘటనలు. రామన్నపేట శివారులో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ ఆద్యంతం ఉత్కంఠగా కొనసాగింది. ఇక రామన్నపేటకు రాకుండా బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేశారు.

– యాదాద్రి భువనగిరి అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ)/రామన్నపేట

గో బ్యాక్ అంబుజా అంటూ నిరసన తెలుపుతున్న యువత

ప్రాణాలు తీసే సిమెంట్ ఫ్యాక్టరీ మాకొద్దు

రామన్నపేటలో ముక్తకంఠంతో నినదించిన ప్రజలు

- ఉద్రిక్త పరిస్థితుల నడుమ ప్రజాభిప్రాయ సేకరణ
- పట్టణంలో స్వచ్ఛంద బంద్‌తో నిరసన
- నల్ల బ్యాడ్జీలు, నల్లజెండాలతో హాజరైన స్థానికులు
- ప్రారంభానికి ముందే ఆందోళన, బైఠాయింపు
- ఎన్జీఓస్ ప్రతినిధులను తరిమికొట్టిన జనం
- అభిప్రాయ సేకరణ సమయంలో టెన్షన్ వాతావరణం
- చొచ్చుకొచ్చే ప్రయత్నం.. పెద్ద ఎత్తున నినాదాలు
- ప్రజాభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని వెళ్లిపోయిన అధికారులు
- సమాధానం చెప్పాలని అడిషనల్ కలెక్టర్ కారు అడ్డగింత
- ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్
- భారీ పోలీస్ బందోబస్తు.. స్థానికులకే అనుమతి

సిమెంట్ ఫ్యాక్టరీ వద్దంటూ ప్రజాభిప్రాయ సేకరణలో అధికారుల ఎదుట ముక్త కంఠంతో తెలుపుతున్న జనం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయాలని సదరు సంస్థ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. రామన్నపేటకు మూడు కిలోమీటర్ల దూరంలో అదానీ భూముల్లో షెడ్డు వేసి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. దీనికి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్, పీసీబీ ఈఈ సంగీత, ఆర్డీఓ శేఖర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా సంస్థ కన్సల్టెంట్ సుబ్బ లక్ష్మణ్ భాస్కరన్ ప్రాజెక్టు గురించి వివరించారు.

ఆందోళనతో షురూ..

ప్రజాభిప్రాయ సేకరణ భాగంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ప్రారంభం నుంచే ఆయా గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో సభా స్థలికి చేరుకున్నారు. అయితే ప్రజాప్రాయ సేకరణకు ఫేక్ ఎన్జీఓలు, ఏపీ నుంచి మహిళలు వచ్చారన్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా ఎన్జీఓలను అనుమతించవద్దని పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. నల్లజెండాలు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. అక్కడే బైఠాయించి ధర్నా నిర్వహించారు. కంపెనీకి వ్యతిరేక నినాదాలు చేశారు. ఇదే సమయంలో సదరు ఎన్జీఓస్‌ను హాజరు కాకుండా అడ్డుకున్నారు. పలువురు ప్రతినిధులను అక్కడి నుంచి తరిమికొట్టే ప్రయత్నం చేశారు.

ముక్తకంఠంతో వ్యతిరేకించిన ప్రజలు

ప్రజాభిప్రాయ సేకరణలో అంబుజా సిమెంట్ ఏర్పాటు ప్రతిపాదనను ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, హాజరై నిరసన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు వేర్వేరుగా తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశ్రమ స్థాపనను అంగీకరించలేదని కుండబద్దలు కొట్టారు. డ్రైపోర్ట్ పేరుతో భూములను కొనుగోలు చేసి, ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామంటే ఎలా ఊరుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల జరిగే పరిణామాలను కొందరు ప్రజా ప్రతినిధులు వివరించే ప్రయత్నం చేశారు. పర్యావరణ పరిరక్షణ వేదిక ప్రతినిధి రేహాన్ తన అభిప్రాయం తెలియజేసి, అంబుజా సిమెంట్ కంపెనీ నివేదిక కాపీలను వేదికపైనే చింపేసి నిరసన వ్యక్తం చేశారు. ఇక అందరి అభిప్రాయాన్ని అధికారులు రికార్డ్ చేసుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంలో ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. గో బ్యాక్ అంబుజా– గో బ్యాక్ అదానీ, ప్రాణాలైనా అర్పిస్తాం.. అంబుజాను ఆపేస్తాం.. అంబుజా వద్దురా –రామన్నపేట ముద్దురా.. అంటూ పెద్ద ఎత్తున నినదించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని, ప్రజాభిప్రాయ సేకరణను ముగిస్తున్నామని అధికారులుతెలిపారు. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ ముగిసింది. కాగా దీనికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరు కాలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరై రామన్నపేట ప్రజలకు మద్దతుగా, పరిశ్రమ ఏర్పాటు చేయాలని తన వాయిస్‌ను వినిపించారు.

నల్లజెండాలు, బెలూన్లతో నిరసన తెలుపుతున్న యువకులు

ప్రజాభిప్రాయం ముగిసిందని తిరిగి వెళ్తుండగా అడిషనల్ కలెక్టర్, అధికారుల కారును అడ్డుకుంటున్న జనం

పలు దఫాలుగా అధికారుల అడ్డగింత..

వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకునే క్రమంలో అధికారులను స్థానికులు పలు దఫాలుగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందని అధికారులు ప్రకటించడంతో స్థానికులు ఒక్కసారిగా కోపోద్రిక్తులయ్యారు. కొందరు స్టేజీ పైకి వెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే వెళ్లిన పలువురు అడిషనల్ కలెక్టర్‌ను ప్రశ్నించారు. అందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక అధికారులు బయటకు వచ్చే సమయంలోనూ పెద్ద ఎత్తున వెంబడించారు. కారులో వెళ్తుండగా వాహనానికి నాలుగు వైపులా కార్నర్ చేసి నిలువరించారు. ప్రజాభిప్రాయ సందర్భంగా జనాలకు ఏదీ చెప్పకుండా వెళ్లొద్దని నినదించారు. దీంతో వెంటనే రంగ ప్రవేశం చేసిన పోలీసులు..అందరినీ చెల్లాచెదురు చేయడంతో అధికారులు వెళ్లిపోయారు.

రామన్నపేట స్వచ్ఛంద బంద్

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా బుధవారం రామన్నపేటలో బంద్ పాటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. అంబుజా సిమెంట్ కంపెనీ ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నల్ల జెండాలతో నిరసన తెలిపారు.

భారీ పోలీస్ బందోబస్తు

ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకుంటాయని భావించిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. స్థానిక పోలీసులతోపాటు సీఆర్పీఎఫ్ రంగంలోకి దిగింది. వందల మంది పోలీసులు విధులు నిర్వహించారు. ప్రారంభంలో గేటు మొదలుకొని సభాస్థలి లోపలికి చేరుకునే వరకు ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. రామన్నపేట మండలానికి చెందిన వారిని మాత్రమే అనుమతించారు.

ఎవరి ఆదేశాల మేరకు అరెస్ట్ చేశారో చెప్పాలి : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనకుండా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను, పార్టీ నేతలు, కార్యకర్తలను అరెస్టు చేయడంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎవరి ఆదేశాల మేరకు నిర్బంధాలు, అరెస్టులు చేస్తున్నారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల మధ్య జరుపకుండా మారుమూల ప్రాంతంలో జరపడాన్ని బట్టే ఉద్దేశమేంటో స్పష్టం అవుతుందన్నారు. అక్కడికి తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు వెళ్తున్న ప్రజలను, ప్రజాప్రతినిధులను అడ్డుకుని అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అక్రమ అరెస్టులు, అడ్డగింతలు, గృహ నిర్బంధాలు చేస్తూ మరీ ఏ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారో చెప్పాలన్నారు. కోదండరాం, హరగోపాల్‌లు కోరుకున్న మార్క్ ప్రజాపాలన, ప్రజాభిప్రాయ సేకరణ ఇదేనా? ప్రభుత్వ నిర్బంధంపై ఇప్పటికైనా నోరువిప్పాలని సూచించారు. మూసీ ప్రక్షాళన అంటూ దాని పుట్టుక ప్రాంతంలో దామగుండం రాడర్ కేంద్రం పెట్టి, చివరలో రామన్నపేటలో ఆదానీ సిమెంట్ కంపెనీ పెట్టడంలో మర్మమేమిటని నిలదీశారు. ఎవరి ప్రయోజనాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళనకు 1.50లక్షల కోట్లు వెచ్చిస్తానంటున్నాడో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, ఇలాంటి నిర్బంధాలు, అరెస్టులు బీఆర్ఎస్‌కు కొత్తకాదన్నారు. అదానీ సిమెంట్స్‌కు వ్యతిరేకంగా అక్కడి ప్రజల పక్షాన కచ్చితంగా నిలబడతామని ఆయన ప్రకటించారు.

అడుగడుగునా అడ్డగింతలు.. అరెస్టులు

మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌ను అరెస్టు చేసి మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన పోలీసులు

- ఎక్కడికక్కడే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల అరెస్టులు
- తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్23(నమస్తే తెలంగాణ) : రామన్నపేటలో జనావాసాల మధ్య తలపెట్టిన అదానీకి చెందిన అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. అదానీకి జీ హూజూర్ అనేలా పోలీసు యంత్రాంగాన్ని మొత్తం రంగంలోకి దింపి ప్రజాభిప్రాయ సేకరణకు తరలివచ్చే వారికి అడుగడుగునా ఆటంకాలు కల్పించారు. కంపెనీ ఏర్పాటును స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో వారిని అక్కడికి రాకుండా అన్ని ప్రయత్నాలు చేశారు. బీఆర్ఎస్ నేతలపై ప్రధానంగా దృష్టి సారించి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల కదలికపై మంగళవారం రాత్రి నుంచే దృష్టిపెట్టారు. బుధవారం ఉదయం నుంచే పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. రాచకొండ పోలీసులతో పాటు నల్లగొండ జిల్లా పోలీసు యంత్రాంగం అదనపు బలగాలతో రోడ్లపైకి వచ్చారు. దీంతో రామన్నపేటకు వస్తున్న నేతలందరీన్ని ఎక్కడికక్కడే అడ్డగించారు. రామన్నపేటకు బయల్దేరిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతోపాటు మరికొందరు నేతలు చిట్యాల సమీపంలోనే పోలీసులు అడ్డగించారు. వీరిని బలవంతంగా పోలీసు వాహనాల్లో ఎక్కించి అదుపులోకి తీసుకున్నారు. తాను స్థానిక మాజీ ఎమ్మెల్యేను ప్రజల పక్షాన తన అభిప్రాయాన్ని వెల్లడించే హక్కు తనకు ఉందని వాదించినా పోలీసులు వినిపించుకోలేదు. ఆయన్ను పక్కనే ఉన్న మునుగోడు, ఆ తర్వాత ఉన్న చండూరు పోలీసు స్టేషన్లను కాదనీ మారుమూల ప్రాంతమైన నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత హైదారాబాద్ నుంచి రామన్నపేటకు వెళ్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను రామన్నపేట శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను మోత్కూర్ పోలీసు స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం తర్వాత వదిలేశారు. భువనగిరి మీదుగా రామన్నపేటకు వస్తున్న మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావును భువనగిరిలోనే పోలీసులు అదుపులోకి తీసుకొని అక్కడే నిర్బంధించారు. ఇదే సమయంలో రామన్నపేటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్న సమాచారంతో నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఇంటికి పోలీసులు భారీ ఎత్తున చేరుకున్నారు. అప్పటికే భూపాల్‌రెడ్డితోపాటు అక్కడే ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డిని ఇంట్లో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇక తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ చెరుకు సుధాకర్ కదలికలపై నిఘా పెట్టి రామన్నపేటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. మరికొందరు ముఖ్య నేతల కదలికలపై నిఘా పెట్టి తదనుగుణంగా జాగ్రత్తలు తీసుకున్నారు.

నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, బీఆర్ఎస్ నాయకులు

గవర్నర్‌ను కలిసిన ఎంజీయూ వీసీ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎంజీయూ వీసీ హుస్సేన్

రామగిరి, అక్టోబర్ 23 : రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీల చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మను బుధవారం ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందచేసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా అన్ని యూనివర్సిటీల నూతన వీసీలంతా తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంతో కలిసి గవర్నర్‌కు యూనివర్సిటీల ప్రగతిని వివరించారు.

నేడు సూర్యాపేటకు గవర్నర్ రాక

సూర్యాపేట, అక్టోబర్ 23 : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌కు రానున్నారు. కలెక్టరేట్‌లో దానికి ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గవర్నర్ ఉదయం 10 గంటలకు వస్తారని, కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలు, ప్రముఖులతో ముఖాముఖి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్, డీఆర్‌డీఓ అప్పారావు, డీఈఓ అశోక్, డీపీఓ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై ఎందుకు మాట్లాడరు?

- మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేల వైఖరి తెలియజేయాలి
- ప్రజా వ్యతిరేక ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయానికి మీరెందుకు హాజరు కారు?
- ఓ వైపు మూసీ ప్రక్షాళన చేస్తామంటూ అంబుజాతో నాశనం చేస్తారా?
- ప్రజాభిప్రాయ సేకరణకు మమ్మల్ని ఎందుకు అడ్డుకున్నారో చెప్పాలి
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 23 : రామన్నపేటలో అదానీ గ్రూప్ చేపడుతున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ఎమ్మెల్సీ కోటిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రామన్నపేటలో నిర్వహించిన ప్రజాభిప్రాయానికి మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. దానికి మాజీ ఎమ్మెల్యేలుగా మమ్మల్ని ఎందుకు హాజరుకానివ్వకుండా పోలీసులతో అరెస్ట్ చేయించటంలో కుట్ర ఏందో చెప్పాలన్నారు. ఇక్కడి వనరులు దోచి పెట్టడానికే ముందస్తుగా సీఎం రేవంత్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో అదానీ వంద కోట్ల రూపాయిలు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

ఇక్కడే ఫ్యాక్టరీ పెట్టడంలో అంతర్యమేమిటి? : ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ

దామరచర్ల లాంటి ప్రాంతాల్లో రా మెటీరియల్ ఉండటంతోపాటు పక్కనే కృష్ణానది ప్రవహిస్తున్నందున అక్కడ అనేక సిమెంట్ ఫ్యాక్టరీ వెలిశాయని, రామన్నపేటలో రా మెటీరియల్ లేకపోగా నీటి లభ్యత కూడా లేదని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఇక్కడ అదానీ గ్రూప్ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయ సేకరణలో రామన్నపేట మండల వాసులకు ఐడీ కార్డులు ఇచ్చి నిర్బంధంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించాల్సిన అవసరం ఏమిటని తెలిపారు. అక్కడికి తాను తప్ప ఏ ఒక్క ప్రజాప్రతిని కూడా రాలేదని, మాజీ ఎమ్మెల్యేలను రాకుండా నిర్బంధించారని మండిపడ్డారు.

పోలీసు పహారాలో ప్రజాభిప్రాయ సేకరణపెట్టడం ఎందుకు? : చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే, నకిరేకల్

నకిరేకల్ నియోజక వర్గంలోని రామన్నపేటలో డ్రైపోర్ట్ పెడతామని గతంలో 300ఎకరాలు సేకరించి ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెడుతామంటున్నారని, 12 గ్రామాల్లో పచ్చని పంట పొలాలను నాశనం చేస్తామంటే ఉపేక్షించేది లేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. ఓ వైపు చిట్యాల ప్రాంతాల్లో కెమికల్ ఫ్యాక్టరీల వల్ల నీరు కలుషితం అవుతుండగా, మరో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ తెచ్చి ఆ వ్యర్థాలను ఎక్కడ పోస్తారని ప్రశ్నించారు. ప్రజల మధ్య పెట్టాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ పోలీసుల మధ్య పెట్టడం ఎందుకని, అలాంటిది సీఎం ఆఫీసులోనే పెట్టుకుంటే సరిపోతది కదా విమర్శించారు. అదానీకి ఫ్యాక్టరీ ఇస్తే మోదీ ఓటుకు నోటు కేసులో రక్షిస్తాడని రేవంత్ ఇక్కడి వనరులు దోచి పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు.

జిల్లా ప్రజలకు ఏం మేలు జరుగుతుందో చెప్పాలి : కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నల్లగొండ

డ్రైపోర్ట్ పేరుతో నాడు భూసేకరణ చేసి ఇప్పుడు రేవంత్‌ను అడ్డం పెట్టుకొని సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టి ప్రజల నోట్లో దుమ్ము కొట్టే ప్రయత్నం అదానీ చేస్తున్నాడని, దీనిపై కోమటిరెడ్డి బ్రదర్స్ తమ వైఖరి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. మోదీ కనుసన్నల్లో అదానీ హైదరాబాద్‌ను కబ్జా చేసేందుకు వస్తుంటే రేవంత్ స్వాగతం పలుకుతున్నాడని విమర్శించారు. సంస్కారం లేని కోమటిరెడ్డి బ్రదర్స్ అడ్డగోలుగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేయటం కాదని, ఈ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీతో నల్లగొండ ప్రజలకు ఏం మేలు జరుగుతుందో చెప్పాలన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య
చిత్రంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, కిశోర్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, భగత్, బీఆర్ఎస్ నేత సుధాకర్‌గౌడ్ తదితరులు

ఎవరి డైరెక్షన్‌లో అడ్డుకుంటున్నారు : గాదరి కిశోర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే, తుంగతుర్తి

సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం వద్దని తాము ప్రజాభిప్రాయ సేకరణలో చెప్పడానికి వెళ్తుంటే పోలీసులు ఎవరి డైరెక్షన్‌లో అడ్డుకుంటున్నారో రాచకొండ సీపీ సమాధానం చెప్పాలన్నారు. రూ.1.50లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తామని చెప్పి, 12లక్షల చెట్లు కొట్టి నాశనం చేయడం, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీతో ధర్మారెడ్డి కాల్వలో వ్యర్థాలు పోయడం నాశనం కాదా అని ప్రశ్నించారు. మూసీనీ కాదు, ముందు సీఎం, మంత్రుల మూతులు ప్రక్షాళన చేసుకోండని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రానికి, కనీసం సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు కూడా రూపాయి ఇవ్వని అదానీ సీఎం రేవంత్‌కు రూ.100 కోట్లు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుమీద, మరో రూ.వెయ్యి కోట్లు వారి అధిష్టానానికి ఇవ్వడానికి కారణం ఈ రాష్ట్రంలో ప్రాజెక్టులను అప్పజెప్పేందుకేనని దుయ్య బట్టారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డిని ఎవరూ, ఏ వర్గం సమర్థించడం లేదన్నారు. అధికారం మారినప్పుడల్లా అదే పార్టీలో ఉండే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనకొడుకుకు పనికిరాని పదవి కోసం పార్టీ మారి నీతులు వల్లిస్తున్నట్లు విమర్శించారు. అతి తెలివి తనకు ఉందని అనుకునే ఆయన ఒకరకమైన రాజకీయ వ్యభిచారి అని ఈ జిల్లా ప్రజలకు తెలుసన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల జరిగే నష్టం గుత్తాకు తెల్వదా, దానిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు చీకటి ఒప్పందాలతో ముందుకు సాగుతున్నాయని, వాటికి కళ్లం వేయాలంటే అది బీఆర్ఎస్ వల్లనే అవుతుదని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు చెరుకు సుధాకర్ గౌడ్, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మారగోని గణేశ్, జమాల్ ఖాద్రి, మాలె శరణ్యారెడ్డి, మెరుగు గోపీనాథ్, దేప వెంకట్ రెడ్డి, పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, కోండ్ర స్వరూప, బొమ్మరబోయిన నాగార్జున పాల్గొన్నారు.